
సత్యసాయి
బాలవికాస్
మాసపత్రిక
ఫిబ్రవరి 2020
వెల 10 రూపాయలు

# పుట్టపర్తిలో సత్యసాయి బాలవికాస్

# పూర్వ విద్యార్థుల స్నాతకోత్సవం









# పుట్టపర్తిలో సత్యసాయి బాలవికాస్
# పూర్వ విద్యార్థుల స్నాతకోత్సవం









Regd. RNI No. APTEL / 2002 / 8813

Postal Registration No.
MPM/L22/SSBV/18-20

This magazine will be posted on 12th of every month.

ఈ పత్రిక ప్రతినెల 12వ తేది పోస్టు చేయబడుతుంది.

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డమాటలట్టె చెవికి చేరు**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురా!**
**ఎట్టి చదువులున్న ఏమి ఫలము?**

మంచి మాటలు వినరు. చెడ్డమాటలైతే ఒక్క క్షణములోపల చెవికి చేర్చుకుంటారు. హృదయమునుంచి ఇంక చేతలోకి వచ్చేస్తుంది. అంటే పనిలో ప్రవేశిస్తాడు. కనుకనే మనసునందు వాక్కునందు, క్రియయందు ఏకత్వాన్ని 'త్రికరణ శుద్ధి'ని మనం నిరూపించాలి.

నీలో ఉన్న దోషాలను పూర్తిగా నిర్మూలం గావించడానికి పూనుకోవాలి. నీ దోషాలనంతా సమర్థించుకోవడానికి ప్రయత్నించకూడదు. అట్లు చేసినవాడే మహాద్రోహి!! ఈనాడు అటువంటి వ్యక్తులే అధికంగా కన్పిస్తున్నారు. కనుక విద్యార్థులు భావిభారత పౌరులు, దేశంయొక్క సౌభాగ్యాన్ని ఆశించే వీరులు. లేతహృదయులైన మీయందు ఈ పవిత్రమైన భావములీనాడు అభివృద్ధికావాలి. చెడ్డమాటలనే చెవికిచేర్చుకునేవారు భగవంతుని (స్వామిని) తెలుసుకొనలేరు. ఎంత గొప్ప చదువు చదివినా ఏమీ ఫలము ఉండదు. **– బాబా.**



"Sathyasaibalavikas" (Telugu monthly magazine)
Email ID : (1) sathyasaibalavikas@yahoo.co.in, (2) sathyasaibalavikas@gmail.com

# సత్యసాయి బాలవికాస్



సంపుటి 19 ఫిబ్రవరి 2020 సంచిక 2


| క్ర.సం. | విషయాలు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | శ్రీ సత్యసాయి అష్టోత్తర శత..... | 2 |
| 2. | మనోనిగ్రహం<br>శ్రీమతి ఎన్నాకుల రేవతి | 3 |
| 3. | భిక్షగాడు<br>శ్రీమతి అబ్బూరి రాధ | 4 |
| 4. | శ్రీ వాణి<br>శ్రీ పోగుల శ్రీనివాసరావు | 5 |
| 5. | బాలవికాస్ – గ్రూప్ 2 క్విజ్<br>శ్రీ కట్టి కృష్ణమ్మ | 6 |
| 6. | శ్రీ మహా భాగవతం | 7 |
| 7. | రంగుల రంగేళి<br>శ్రీమతి మద్దుల శాంతకుమారి | 10 |
| 8. | మూడు చేపలు<br>శ్రీమతి మంథా నీలవేణి | 12 |
| 9. | నిజమైన స్నేహితులు | 14 |
| 10. | పదవనము<br>శ్రీ పలివెల సుబ్బారాయుడు | 15 |
| 11. | అసలైన భక్తులు<br>శ్రీమతి సుంకర రాజకుమారి | 17 |
| 12. | అమృత గుళికలు – 169 | 19 |
| 13. | తల్లుల పెంపకం – తనయుల సౌభాగ్యం<br>శ్రీమతి కొమరగిరి జయప్రద | 20 |
| 14. | శ్రీ ...మహా భారత కథలు ....(సీరియల్)<br>శ్రీమతి ఆర్. దుర్గ | 22 |
| 15. | పుట్టపర్తిలో....బాలవికాస్... స్నాతకోత్సవం | 24 |


**Convenors :** Ms Yadavalli Padmaja and Smt Ganga Pidatala, State Coordinators, Educational Wing ( Sri Sathya Sai Bal Vikas) Sri Sathya Sai Seva Organisations, A.P & T.S.
***Smt.K.Sudha, State Mahilavibhag Coordinator***
***Publisher & Correspondent :*** T.S.N. Rao
***For Subscriptions Contact***
T.S.N. Rao, F 2, B Block, Brindavan Apartments, Chikoti Gardens, Begumpet, Hyderabad
**Email: sathyasaibalavikas@yahoo.co.in**
***Editor :* Dr. M. Lavanya Saraswathi, M.A., M.Phil., Ph.D., Phone: 9490117654**
***Printed at :*** Sreevani Offset Printers, Machilipatnam.Tel.:08672-221137, 08672-227374

**చందాదారుల సలహాదారు** (subscribers adviser) **:**
**Asst.Editor : యు. మాధురి 9848652486**
**చందాలకు చిరునామా :** టి.ఎస్.ఎన్. రావు, ఎఫ్ 2, బి–బ్లాక్, బృందావన్ అపార్ట్‌మెంట్స్, శ్రీచికోటి గార్డెన్స్, బేగంపేట,హైదరాబాద్–500 016.
**విడి సంచిక –10/– రు.లు.సంవత్సర చందా : 120/– మూడు సంవత్సరములకు : `350/ రు.లు.**
**Name of the Bank : State Bank of India**
Branch Name : **Hyderabad Public School,**
Account Holder : **Sathya Sai Balavikas**
**A/CNO: 30021971566 IFSC CODE: SBIN0002728**
**MICR CODE : 50002046.**
**Single Copy : Rs. 10/- Annual Subscription INDIA - Rs. 120/- FOR THREE YEARS - Rs. 350 for Foreign Countries - Rs.1000/P/A- can be paid by cash, M.Os, D.Ds, online, (cheques in Hyd only)**

# భగవాన్ శ్రీ సత్యసాయి అష్టోత్తర శతనామావళి

**98. ఓం శ్రీ సాయి సకలసంశయ హరాయ నమః**

**(భక్తుల అనుమానములను అన్నింటిని తొలగించు స్వామికి నమస్కారము)**



భగవాన్ బాబా పుట్టపర్తిలో ఇంటర్వ్యూ గదిలో మానవజాతి పరిణామ సిద్ధాంతాన్ని గురించి వివరిస్తున్నారు. 'నేలపైన సంచరించే తోకలున్న కోతులతోకంటే వృక్షములపైన సంచరించే తోకలులేని కోతులతోనే మనుష్యులకు దగ్గర సంబంధముంది' అన్నారు. వింటున్న కస్తూరిగారికి, ఇంకొక ఏంత్రపాలజీ ప్రొఫెసర్ గారికి ఈ విషయం స్పష్టంగా అర్థంకాక బాబా వైపు అయోమయంగా చూడసాగారు. బాబా నిదానంగా చేయిని తిప్పారు. విచిత్రంగా బాబా చేతిలోకి చిన్న కోతిపిల్ల వచ్చింది. దానికి తోక లేదు. శరీరంమీద వెంట్రుకలు లేవు. ఇంటర్వ్యూగదిలో దానిని చూసినవాళ్ళు గాభరాపడ్డారు. దానిని చూపించి 'మానవజాతి ఈ కోతినుంచే పరిణామంచెందిందని' అన్నారు. ఇంటర్వ్యూగదిలో అది అటూ ఇటూ తిరుగుతుంటే భక్తులు ఆశ్చర్యంతో కంగారుపడసాగారు. తరువాత బాబా దానిని తన చేతిలోకి తీసుకుని మరొక చేతిని దానిపైనఉంచి మెల్లగా నొక్కారు. అంతే!! అది అదృశ్యమయింది. మన సంశయములను (సందేహములను) తొలగించు స్వామికి నమస్కారము అని ఈ నామముతో స్వామిని పూజించుచున్నాము.

**('శ్రీ సత్యసాయి అష్టోత్తర శతనామ సౌందర్యము" అనే గ్రంథం నుంచి కొన్ని భాగాలను గ్రహించడానికి అనుమతించిన రచయిత డా।। జంధ్యాల సుమన్ బాబు గారికి కృతజ్ఞతలు.)**

# మనో నిగ్రహం

ప్రపంచం మొత్తాన్ని జయించడమైనా సులభమేమో కాని, మనస్సును జయించుట చాలా కష్టము. మనోనిగ్రహం కలవాడే **మహామనీషి** అవుతాడు.

దీనికి ఉదాహరణ ఈ చిన్న కథ.....

ఒక అడవిలో ఒక మునీశ్వరుడు తపస్సుచేసుకుంటూ ఉండేవాడు. పండ్లు, నీరు మాత్రమే తీసుకుంటూ తపస్సు చేసుకొనెడివాడు. అదే అడవిలో నివసించే ఒక కోతికి కూడా తపస్సు చేయాలనే కోరిక కలిగింది. మునీశ్వరుని దగ్గరకు వెళ్ళి"స్వామీ! నాకు కూడా మీలాగ తపస్సు చేయాలనే కోరిక కలుగుతోంది. దయచేసి తపస్సునెలా చేయాలో నేర్పండి" అని వేడుకొనెను. అందులకా ముని, "స్వేచ్ఛగా అడవిలో తిరుగాడే నీకు తపస్సు ఎందులకు? ఇంద్రియములను నిగ్రహించి తపమాచరించడం అంత తేలికైన విషయం కాదని " వారించాడు.

కాని, ఆ కోతి ఆయన మాటలను వినక, పట్టుబట్టి తపస్సునెలా చేయాలో నేర్పేవరకు ఆ ఆశ్రమంలో ఆయన ముందే కూర్చుంది. ఆ మునీశ్వరుడు ఇక చేసేదేమి లేక "సరే" నని ఒప్పుకొని, ఆకోతిని ఒక గదిలో కూర్చుండబెట్టి దానికెదురుగా మంచి తియ్యటి మామిడిపండును, అరటిపండును ఉంచెను. "ఆ పండు తినాలనే కోరికను జయించడమే తపము" అని చెప్పి బయటకు వెళ్ళెను.




కోతి కళ్ళు మూసుకుని తపమాచరించసాగెను. అరటిపండు వాసన ముక్కుకు తాకగా కళ్ళు తెరచి అరటిపండును చూడసాగెను. మెల్లగా అరటిపండు తినాలనే కోరిక అధికం కాసాగెను. కోతి మనస్సులో, "తపస్సు ఈరోజే చేయాలని ఏముంది? రేపైనా చేయొచ్చు"నని అనుకొని, గుటుక్కున ఆ పండును తినేసి చెట్టెక్కి పారిపోయింది. "అందుకే మనస్సు కోతిలాంటిదని, దానిని జయించడం చాలా కష్టమని" అంటారు పెద్దలు.

**సమర్పణ: ఎన్నాకుల రేవతి, జగిత్యాల.**

# భిక్షగాడు

ఒక రాజ్యంలో ఒక భిక్షగాడు ఉండేవాడు. అతను రాజభవంతికి దగ్గరలో ఉంటూ రోజూ ఆ భవంతిలోని రాజుగారిని దూరంనుండి చూస్తూండేవాడు. ఒక రోజు రాజుగారు అందరికి విందు ఇస్తున్నారన్న వార్తను విన్నాడు. అది విన్న ఆభిక్షగాడికి, తాను కూడా ఆ విందులో పాల్గొనాలని ఒక ఆశ కలిగింది. తన దుస్తులను చూసుకుంటే చిరిగిపోయి మాసిపోయి ఉన్నాయి. ఎలాగైనా రాజుగారి దగ్గరనుండి మంచి దుస్తులు సంపాదించాలనుకున్నాడు. ఎలాగో కాపలాదారులను బతిమలాడి రాజుగారి భవంతిలో ప్రవేశించాడు. వంగి వంగి దండాలుపెడుతున్న భిక్షగాడిని, వాడి అవతారాన్ని చూసి, రాజుగారు "ఏమి కావాలి నీకు" అని ప్రశ్నించారు. వెంటనే భిక్షగాడు "మీరు అందరికి విందు ఇస్తున్నారని విన్నాను. ఆవిందుకు రావాలని నాకు ఆశగా వుంది. నాదగ్గర మంచి బట్టలు లేవు, ఉన్నవన్నీ చిరిగిపోయి ఉన్నాయి. మీపాత దుస్తులను నాకు ఇప్పించండి" అన్నాడు. వెంటనే రాజుగారు తన పాత బట్టలు ఒక జతను ఇచ్చి, "ఇవి ఎన్నటికీ మాసిపోవు, చిరిగిపోవు, దుమ్ము పట్టవు, వీటిని ధరించి హాయిగా ఉండ"మన్నారు.

ఇంటికి వచ్చి ఆ బట్టలను ధరించి, ఆ భిక్షగాడు అద్దంలో తనను తాను చూసుకొని మురిసిపోయాడు. ఎప్పుడైనా ఇవి చిరిగిపోయి పాతబడితే ఎట్లా!! అని ఆలోచించి తన పాతబట్టలను మూటకట్టి, ఎక్కడికెళ్ళినా తనతోపాటు తీసుకెళ్ళేవాడు. రాజుగారి విందుకు వెళ్ళేముందు ఆమూటను ఒకచోట దాచిపెట్టి వెళ్ళాడు. విందును ఆరగిస్తున్నంతసేపు దానిని ఎవరైనా ఎత్తుకెళ్తారేమోనని వాడికి తన మూటమీదే మనస్సు ఉండినది. మనస్పూర్తిగా విందును ఆరగించలేకపోయాడు. రాజుగారు ఎంత నచ్చచెప్పినా భిక్షగాడు తన పాతబట్టలమూటను మాత్రం వదిలేవాడుకాదు.

క్రమంగా రాజుగారి మాటలలోని సత్యం తెలిసివచ్చింది!! ఆ దుస్తులను ఎన్నిరోజులు ధరించినా పాతబడలేదు, చిరిగిపోలేదు. కానీ తన పాతదుస్తులపైనున్న మమకారంతో ఆపాతదుస్తుల మూటను వదిలేవాడుకాదు. అది చూసిన తోటివారు, ధరించేదేమో రాజుగారి దుస్తులు, మోసేదేమో పాతదుస్తులు అని హేళనచేస్తూ 'పీలిక గుడ్డల మనిషి' అంటూ పిలువసాగారు.

చివరగా ఆ భిక్షగాడు చనిపోవుటకు సిద్ధంగావుండి లేవలేని స్థితిలో ఉండగా జనాలు అతనిని చూడటానికి వచ్చి, అతని తలగడ క్రిందనున్న పాతదుస్తులమూటను చూశారు. ఎంతో విలువైన చిరగని, తరగని దుస్తులు ధరించినా కూడా భిక్షగాడికి పాతబట్టలమూటపై వ్యామోహం పోలేదు. వాటి సంరక్షణకోసమే జీవితమంతా గడిపి, ఏరోజూ సంతోషాన్ని పొందలేదు కదా!! అని బాధ పడ్డారు.

ఇది ఒక భిక్షగాడి కథ మాత్రమే కాదు, మనమందరం కూడా పాతదుస్తుల మూటలాంటి అనేక చెడుగుణాలను, భావనలను మాటిమాటికి గుర్తుతెచ్చుకుంటూ, జీవితంలోని అందమైన సంతోషమైనవాటిని అనుభవించలేము, గుర్తించలేము కూడా!! పాతబట్టల్లాంటి చెడు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అశాంతికి, బాధలకు గురిఅవుతాము. కనుక ఎప్పుడు నిత్యనూతనమైన స్వచ్ఛమైన ఆలోచనలను, గుణాలను కలిగివుండాలి.

**సమర్పణ: *అబ్బూరి రాధ*, వాట్సాప్ సౌజన్యంతో..**

---

**శ్రీపంచమి సందర్భముగా ....**

# శ్రీవాణి

***పోగుల శ్రీనివాసరావు***, **పత్తిపాడు, గుంటూరు జిల్లా.**

మా తల్లి మమ్మేలు శ్రీవాణి
మమ్మెపుడు కరుణించు గీర్వాణి
మాలోని సుజ్ఞాన సుమరాణి
మమ్మెపుడు దీవించు మృదుపాణి ॥మా తల్లి॥

నీ ఉన్న తావే నవనందనం
నీ కంటిచూపే శ్రీచందనం
నీ మౌనరాగం మాభావం
నీ ధ్యానయోగం మా జీవం ॥మా తల్లి॥

మావాక్కు రుక్కులై భాసిల్లుమా
మా బుద్ధి సిద్ధివై విలసిల్లుమా
మా తనువు నీ చరణమంజీరము
మా బ్రతుకు నీ పాదమందారము ॥మా తల్లి॥



(బాలవికాస్ - గ్రూప్ 2)

# క్విజ్

సమర్పణ: కర్రి క్రిష్ణమ్మ, వీరఘట్టం, శ్రీకాకుళం జిల్లా.

**ఈ జంతువుల జీవితాలు ధన్యమైనవి. గడులు నింపండి...**

1. శివాలయంలో లింగంపైన చాపగా గూడును అల్లినది - (1)
2. క్షీరసాగర మథనంలో మందరగిరి క్రిందన చేరింది --- (3)
3. శ్రీకృష్ణుని చెఱసాలనుండి తప్పించి తీసుకుని వెళ్ళుటకు వసుదేవునకు సహాయపడినది --- (3)
4. మడుగులోనున్న మొసలితో పోరాడి విముక్తి పొందినది --- (3)
5. శివుని వాహనమై సేవలందించినది -- (2)
6. శివలింగంపై రత్నంను (మణిని) పెట్టి పూజించేది --- (3)
7. మంధర పర్వతమునకు త్రాడుగా ఏర్పడినది -- (2)
8. శివలింగమునకు నిత్యము అభిషేకము చేసినది -- (2)
9. శ్రీరాముడు వారధి కట్టడంలో చిన్న జంతువైనా తనవంతు సేవ చేసినది --- (3)
10. ధర్మరాజుకు మహాప్రస్థానంలో మోక్షప్రాప్తి కలిగించింది -- (2)
11. వినాయకునకు వాహనమైనది --- (3)
12. దుర్గామాతకు వాహనమైనది -- (2)
13. అయ్యప్పదేవునికి వాహనమైనది -- (2)
14. శ్రీనివాసునకు పుట్టపై నిలిచి పాలు పోసినది -- (2)
15. శ్రీకృష్ణునితో తలపడి శమంతక మణిని, కుమార్తెను ఇచ్చినది (జాంబవంతుని మరోపేరు) ----- (5)
16. శ్రీమహావిష్ణువు అవతారమెత్తి భూదేవిని రక్షించినది (పందికి మరోపేరు) ---- (4)

**గమనిక:** 1,6,8 గడుల జవాబులను కలిపితే ఒక పుణ్యక్షేత్రమవుతుంది.

**జవాబులు 16 వ పేజిలో చూడండి.**



# శ్రీ మహా భాగవతం

## (బాలవికాస్ పిల్లలకోసం ప్రత్యేకం)

## దశమ స్కంధము



*(గత సంచిక తరువాయి)*

**కోపము పాపమునకు ధూపము :** కోపము ఎంతటివారికయినా హాని కలిగించును. ఒకసారి బలరాముని ఆగ్రహము అనర్థమును తెచ్చెను. సూతమహాముని సత్వగుణము కలవాడు, భగవంతుని గాథలను, పురాణకథలను సూతుడు అరణ్యములో సజ్జనులందరికీ వినిపించుచుండెను. కోపము ఎంతవారిచేతనయినా పాపములను చేయించును. కనుకనే స్వామి 'కోపము పాపమునకు ధూపము' అని చెప్పిరి. బలరామునంతటి మహానుభావుడు తన కోపమును నిగ్రహించుకోలేక మహామునీశ్వరుడయిన సూతుని చంపెను. ఆ కథ తెలుసుకుందాము.

ఒకప్పుడు నైమిశారణ్యములో దీర్ఘసత్రయాగము అను ఒక యాగము జరుగుచుండెను. అక్కడ సూతుడు పురాణములను వినిపించుచుండెను. పెద్దలందరూ చుట్టూచేరి పురాణగాథను వినుచుండిరి. బలరాముడు అక్కడికి వచ్చెను. ఆ సభలోఉన్నవారందరూ లేచినిలబడి బలరామునికి నమస్కరించిరి. కాని సూతుడు మాత్రము లేచి అభివాదము చేయలేదు. దానిని గమనించిన బలరాముడు 'ఈ సూతుని గొప్పదనమేమి? వ్యాసుడు రచించిన పురాణగాథలను తెలుసుకుని ఇతరులకు చెప్పుచుండును. నన్నుగౌరవించునదేమి? అను నిర్లక్ష్యముతో లేచి నిలబడలేదు. నేను ఆదిశేషుడను, దైవకార్యనిమిత్తమై ఈ లోకమున అవతరించినవాడను.' ఇతనికి తగిన బుద్ధిచెప్పవలెననుకొనెను. సూతునికి దగ్గరగా నడచివచ్చెను. అక్కడున్న దర్భలలో ఒక దర్భను చేతిలోనికి తీసుకొనెను. దానిని చేతితో సూతుని కంఠముదగ్గర విదిలించెను. పదునైన కత్తివంటి ఆ దర్భఅంచుతో సూతునికంఠము తెగి కిందపడెను. సూతమహాముని మరణించెను. సభలో హాహాకారములు చెలరేగెను. బలరాముడు 'నేను వచ్చినపుడు సభలోనివారందరూ లేచి అభివాదము చేసిరి. కాని పురాణప్రవచనము చేయుచున్న ఈయన

లేచినిలబడలేదు. నాపట్ల నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శించెను. కనుక ఆయన కంఠమును నరికివేసితిని' అని పలికెను.

అప్పుడు పురాణమువినుచున్న వారు ఇట్లు పలికిరి. 'బలరామదేవా! నీవలన జరుగకూడని ఘోరఅపచారము జరిగిపోయినది. సూతుడు ధర్మాధర్మ విచక్షణ కలవాడు. ఆయన లేవకపోవుటకు తగిన కారణమున్నది. ఆయనకు మేము బ్రహ్మాసనమునుఇచ్చి పురాణప్రవచనము చేయమని కోరితిమి. అనగా బ్రహ్మపదవిని ఇచ్చినట్లు, ఆయన బ్రహ్మయై కూర్చుని ఉండగా నీవు సభలోకి వచ్చితివి. ఎవరు అందరిచే పూజింపబడు పెద్ద ఆసనమునందు బ్రహ్మగా ఉందురో వారు లేచి నిలబడి నమస్కరించవలసిన అవసరములేదు. అందువలన సూతమహాముని కూర్చుని ఉండిపోయెను. కనుక ఇందు సూతుని దోషము ఇసుమంతైనా లేదు. నీకు ధర్మసూక్ష్మములన్నియు తెలియును. బ్రహ్మపదవిని, బ్రహ్మాసనమును మేము సూతునకు ఇచ్చిన సంగతి నీకు తెలియక, నీవు కోపముతో ఆ ముని కుత్తుకను కోసిచంపివేసితివి. మునీశ్వరుని చంపిన మహాపాపము నీకుచుట్టుకొనును' అనిరి.

అప్పుడు బలరాముడు తాను చేసిన పాపపు పనికి చాలా బాధపడెను. 'అయ్యో! నేను చాలా పాపము చేసితిని, ఇంతటి మహానుభావుని చంపితిని. ఇప్పుడు నేను ఏమి చేయవలెనుమీరు నాకు ప్రాయశ్చిత్తమును చెప్పుడు' అని ప్రార్థించసాగెను. 'నీవు అనంతుడవు కదా! నీ ఈశ్వరశక్తితో సూతునికి ప్రాణముపోసి, తిరిగి బ్రతికించుము' అనిరి.

బలరాముడు 'మీరు నాకు మంచి మాట చెప్పి, తగిన సూచనను చేసితిరి. నేను నా యోగశక్తితో ఆయనను బ్రతికించెదను. ఇంతకు ముందుఉన్న సూతునికి ఇప్పుడు నేను బ్రతికించు సూతునికి చాలా భేదముండును. 'ఈ సూతునికి ఏ వ్యాధి సోకదు, బుద్ధియందు కాని, ధారణా శక్తియందు కానీ ఏమాత్రము మాంద్యము అనునదేఉండదు. అపారమైన విద్యాబలముతో, గొప్ప శక్తిసామర్థ్యములతో విలసిల్లుచుండును' అని ఆ శక్తులనిచ్చి సూతుని పునరుజ్జీవితుని గావించెను. 'నేను చేసిన దోషమునకు పరిహారము ఇంత మాత్రమే చాలదు, మీరు ఇంకనూ ఏదయినా కోరుకొనుడు, మీ కోరికను తీర్చెదను' అని బలరాముడు అనెను.

అప్పుడు తిరిగి జీవించిన సూతుడు 'బలరామా! నీవు ఒక ఉపకారమును చేయుము. పల్వలుడు అను ఒక రాక్షసుడు మేము లోకకల్యాణార్థము చేయు యజ్ఞయాగాదులను భంగముచేయుచున్నాడు. లోకకంటకుడైన ఆ పల్వలుని సంహరించి, మా యజ్ఞయాగములకు ఆటంకము లేకుండా చేయుము' అని పలికెను. వారి కోరికకూడ లోకకల్యాణమునకు ఉపయోగపడునదే కాని, స్వార్థమునకు కాదు. దానికి బలరాముడు ఆ మునీశ్వరునితో 'మీరు యజ్ఞమును ప్రారంభించుడు, పల్వలుడు వచ్చినచో నేను అతడిని సంహరించెదను' అని చెప్పెను.

**బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళుట:** మునీశ్వరులు యజ్ఞమును ఆరంభించిరి. వారు అనుకున్నట్లే పల్వలుడు వచ్చి హోమగుండములో నీచమైన వస్తువులను వేయసాగెను. బలరాముడు వెంటనే తనచేతిలోని నాగలితో అతడి తలకాయను కిందికి లాగి, కుడిచేతితో రోకలి తీసుకుని ఆతడి తలమీద ఒక్కదెబ్బ కొట్టెను. ఆ దెబ్బకు నెత్తురు బుగబుగ కక్కుకొనుచూ పల్వలుడు మరణించెను. బలరాముడు 'నేను పల్వలుని సంహరించితిని. మీరు ఇక నిరాటంకముగా యజ్ఞయాగాదులు చేసుకొనవచ్చును. కాని నేను చేసిన పాపకృత్యపు తలంపు నన్ను బాధించుచున్నది. నేను చేసిన పాపములు పోవుటకు ఈ పనులు చేసితిని. కాని నేను కొంత పుణ్యమునుకూడా సమకూర్చుకొనవలెననుకొనుచున్నాను. నేను ఏ మంచిపనులు చేసినచో మనసుకు ప్రశాంతత కలుగునో అటువంటి వానిని చెప్పుడు' అని కోరెను. ఋషులు 'నీవు పన్నెండు నెలలు దేశమంతా తిరిగి పుణ్యతీర్థములలో స్నానముచేసినచో నీకు మనశ్శాంతి కలుగును. పుణ్యమునుపొంది, సత్వగుణమును పొందగలవు. అహంకారము తొలగును. వినయము పెరుగును' అని చెప్పిరి. బలరాముడు పుణ్యతీర్థములకు పయనమయి వెళ్ళెను. పుణ్యతీర్థములయందు స్నానము, పుణ్యక్షేత్రముల దర్శనము మన సంప్రదాయములో ఎందుకు ఉన్నదో ఈ కథ తెలియచేయును. బలరామునివలె తన తప్పుతెలుసుకుని, దానిని అంగీకరించి, సరిదిద్దుకొనువాడు ఉత్తముడు.' ఈ విధముగా శుకమహాముని పరీక్షిత్ మహారాజుకు బలరాముని వృత్తాంతమును తెలియచేసెను. **(ఇంకాఉంది)**

# రంగుల రంగేళి

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి మద్దుల శాంతకుమారి**, పూర్వ విద్యార్థిని, మహబూబ్‌నగర్.

విధి విచిత్రమంటే ఇదేనేమో!! తప్పు ఒకరిది! శిక్ష మరొకరికి!! రాత్రంతా అర్పిత్ వద్దనే హాస్పిటల్‌లో ఉన్నారు అరుణ్‌వైజయంతులు. మరునాడు డాక్టరుగారు ఒక చిన్న సర్జరీ చేయాలన్నారు. బంగారం లాంటి పిల్లవాడికి ఇలా అయ్యిందేమిటని వైజయంతి తల్లడిల్లిపోయింది!! అర్పిత్‌కు కళ్ళు బాగవ్వాలని భగవంతుని వేనోళ్ళ ప్రార్థించింది. కానీ విధి చిన్నచూపు చూసింది!! చిన్నారి అర్పిత్ వెంటనే కళ్ళు కడుగుకోకుండా కళ్ళను నులుముకోవడం మూలాన ప్రమాదకరమైన రంగులు కళ్ళల్లోకి వెళ్ళడం వలన డాక్టర్లు కూడా ఏమీ చేయలేకపోయారు. అర్పిత్ ఒక కన్ను పూర్తిగా కోల్పోవలసి వచ్చింది!! ఇక వైజయంతి అరుణ్‌ల దుఃఖానికి అంతులేదు.

నాలుగురోజులైనా బుజ్జిగాడు స్కూలుకు ఎందుకు రావటంలేదో కనుగొనేందుకు వాడి స్నేహితులు, తల్లిదండ్రులు, టీచర్లు హాస్పిటల్‌కు వచ్చి, విషయం తెలుసుకుని ఒక్కసారిగా అవాక్కయ్యారు!! పిల్లలైతే తాము చేసిన చిలిపి చేష్టల వలన ఇంత నష్టముంటుందా! అని షాక్‌కు గురయ్యారు.

అప్పటికే రౌండ్స్‌కు వచ్చిన డాక్టరుగారు ఆర్టిఫిషియల్ రంగుల్లో వుండే విషపూరిత రసాయనిక పదార్థాల గురించి వారందరికీ విశదంగా తెలిపారు. హోలీలో వాడే ముదురు రంగులలో కాపర్ సల్ఫేట్, మెర్క్యురీ సల్ఫేట్, లెడ్ ఆక్సైడ్ మొదలైన రసాయనిక పదార్థాలు వుండటం వలన కళ్ళు ఎర్రబడటం, కంటిచూపు కోల్పోవడం, రకరకాల చర్మరోగాలు, కాన్సర్‌లు, బుద్ధిమాంద్యత (మెంటల్ రిటార్డేషన్), జుట్టు పొడిబారటం; నల్లరంగులోని లెడ్ ఆక్సైడ్ వలన కిడ్నీజబ్బులు; వంగపండు రంగులోని క్లోరిన్ అయోడిన్ వలన ఆస్త్మా ఇంకా ఎన్నో సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఇటువంటి అవగాహన లేక, తాము చేసిన తప్పుకు పశ్చాత్తాపపడ్డారందరు!!

స్నేహితుల తల్లిదండ్రులందరూ వైజయంతిని, అరుణ్‌ను క్షమాపణ కోరారు. అపార్ట్‌మెంటులోని పిల్లలందరూ ఇంకెప్పుడూ అటువంటి రంగుల జోలికి వెళ్ళమని, సహజరంగులే ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వారిలో కొంతమందైతే ఇక ముందెన్నడూ హోలీనే ఆడమని అన్నారు.

మరి కొంతమంది హోలీ ఆడేముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టరు గారిని అడిగి తెలుసుకున్నారు.

**అవి:**

1. ఒంటికి కొబ్బరినూనె రాసుకోవడం
2. హోలీ ఆడి స్నానం చేసిన తరువాత సన్‌స్క్రీన్ లోషన్ ఒంటికి రాసుకోవడం
3. ఆవనూనె తలకు రాసుకోవడం
4. కళ్ళకు కళ్ళజోడు (సన్‌గ్లాసెస్) పెట్టుకోవడం
5. మంచినీళ్ళు అధికంగా త్రాగడం
6. తడిబట్టలతో ఎక్కువసేపు ఉండకుండా చూసుకోవడం
7. కళ్ళల్లో రంగుపడితే, వెంటనే కళ్ళను చల్లటి నీళ్ళతో కడగడం, ఒక గంట సేపటిలో దురద తగ్గకుంటే డాక్టరు గారిని సంప్రదించడంలాంటి జాగ్రత్తలన్నీ ఒక లిస్ట్‌లాగా తయారుచేసి అందరికీ తెలియజేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఎవరేమి చేసినా పోయిన కళ్ళు తిరిగిరావు కదా!! చిన్నారి అర్పిత్ భవిష్యత్ అంధకారమయ్యింది. పాపం కదా బుజ్జిగాడు!!

చూశారా పిల్లలూ! హానికరమైన రంగులతో హోలి వేడుకలు జరుపుకుని సరదాలు తీర్చుకుంటే మనకెంత నష్టమో! కాబట్టి సహజ రంగులు తప్ప దుకాణాలలో అమ్మే కెమికల్స్ కలిపిన రంగుల జోలికి వెళ్ళకండి!! సంప్రదాయల అంతరార్థాలను తెలుసుకుని పండుగలను జరుపుకోవాలి గాని విపరీత పోకడలకు పోయి ప్రమాదాలను కొని తెచ్చుకోకూడదు. తెలిసింది కదా మీ అందరికీ....

**(సమాప్తం)**

జూనియర్స్ కోసం కథ

# మూడు చేపలు

శ్రీమతి మంథా నీలవేణి, విశాఖపట్టణం.

రామయ్యఅనే జాలరి ఒక సరస్సులో చేపలుపట్టి జీవించేవాడు. రోజుకు మూడు చేపలనే తన అవసరానికిమాత్రం పట్టుకునేవాడు. ఆ రోజు ఎప్పటిలాగే మూడుచేపలు పట్టుకుని ఆనందంగా ఇంటికి వెళ్తున్నాడు. పల్లెపాటలు పాడుకుంటూ ఉల్లాసంగా వెళ్తున్న అతడికి ఒక స్వామీజీ ఎదురయ్యాడు.

ఆ జాలరి ఆనందంగా ఉండటం చూసిన స్వామీజీ "నువ్వు చూడటానికి మామూలు మనిషిలా ఉన్నావు. చేపలు పడుతూ బతికేవాడివి ఇంత సంతోషంగా ఎలా ఉంటున్నావు?"అని అడిగాడు. జాలరి స్వామీజీని చూసి చేతులు జోడించాడు."ఉన్నదానితోనే సంతృప్తి పడటంలోనే నాకు సంతోషంగా ఉంటుంది స్వామి. నేను రోజు సరస్సులో మూడు చేపలే పడతాను. ఒకచేపను నేను ఇంట్లోకి వాడుకుంటాను. మిగిలిన రెండు చేపలలోనూ ఒక చేపను అమ్మి, ఆ డబ్బుతో బియ్యం కొంటాను. రెండవ చేపను అమ్మగా వచ్చినడబ్బుతో ఇతర సరుకులు కొంటాను. ఇలా నాకుటుంబాన్ని పోషించుకుంటాను' అని వినయంగా నవ్వుతూ అన్నాడు. ఆ జాలరి ఎంతో తెలివితక్కువ వాడిలా స్వామీజీకి కనిపించాడు. 'నువ్వు ఇంకా ఎక్కువగా చేపలు పట్టుకుని ధనవంతుడివి అవవచ్చు కదా!' అన్నాడు స్వామీజీ. ఆ జాలరి ఫక్కుమని నవ్వి 'నేను ఇలా ఉండటానికే ఇష్టపడతాను. ధనవంతుడిని అయితే కాయకష్టాన్ని, మానవత్వాన్ని, దయను, మరిచిపోవాల్సి వస్తుంది. మీరు చెప్పినట్లుగా సరస్సులోని చేపలన్నింటిని పట్టేస్తే ఈ చేపజాతి చచ్చిపోతుంది. నేను రోజుకు మూడు చేపలే పట్టుకుంటాను. కాబట్టి ఈ చేపజాతి చావదు. మిగిలిన చేపలు గుడ్లుపెడుతూ, పిల్లల్ని పెంచుతూ అవి అభివృద్ధి చెందుతూ ఉంటాయి. అవి అలా బాగుంటేనే కదా, నా జీవితం, నా వ్యాపారం బాగుంటాయి' అన్నాడు జాలరి. స్వామీజీకి జాలరి ఎంతో అమాయకుడిలా కనిపించాడు. 'మరీ అమాయకుడిలా ఉన్నావే! నేనే జాలరినైతే సరసులోని చేపలన్నింటినీ ఒకేసారి వేటాడి అమ్మేస్తాను. దానితో ఒక పడవ, పెద్ద వల కొనుక్కుని సముద్రంలో వేటకు వెళ్తాను. పెద్దపెద్ద చేపలు పడతాను. లక్షలు సంపాదించి పెద్ద ధనవంతుడిని

అవుతాను. తరువాత హాయిగా ఉల్లాసంగా, ఉత్సాహంగా తిరుగుతూ ఉంటాను' అన్నాడు స్వామీజీ.

స్వామీజీ మాటలన్నీ ఆశ్చర్యంతో విన్న రామయ్య నిండుగా నవ్వి, ఇలా అన్నాడు. 'స్వామీ! మీరు ఎప్పుడో ధనవంతులై హాయిగా సంతోషంగా ఉంటానని చెపుతున్నారు. కానీ, ఆ సంతోషాన్ని, ఉత్సాహాన్ని ఇప్పుడే అనుభవిస్తున్నాను. మనిషి హాయిగా బతకడానికి డబ్బు ముఖ్యం కాదు స్వామీ! తృప్తి ప్రధానం' అన్నాడు. స్వామీజీ జాలరి జ్ఞానానికి నివ్వెరపోయాడు. తనకన్నా ఇతడే గొప్పవాడనిపించింది. మెచ్చుకోలుగా రామయ్య వైపుచూసి, 'నువ్వు చెప్పినది నిజమే, మనిషికి తృప్తి ముఖ్యం' అని మరోసారి రామయ్యను మెచ్చుకుంటూ ముందుకు నడిచాడు స్వామీజీ.

**నీతి:** డబ్బుతో సుఖం ఆనందం రావు, తృప్తిలోనే సంతోషం వస్తుంది. మనిషికి ఎంత ఉంటే అంతలోనే సంతృప్తి చెందిన వారికి జీవితమంతా సుఖసంతోషాలే కలుగుతాయి.

చూశారా! బాలలూ! మన స్వామికూడా ఇదే చెపుతారు తెలిసిందా!



జూనియర్స్ కోసం కథ

# నిజమైన స్నేహితులు

ఒకఊరిలో పెద్దపూలతోట ఉండేది. ఆ తోటలోని చెట్టుమీద గూటిలో ఒక పావురం ఉండేది. మేతకోసం వచ్చే కోడిపుంజుతో దానికి స్నేహం ఏర్పడింది. ఒకరోజు అటుగా వెళ్తున్న వేటగాడు తోటలో తిరుగుతున్న కోడిపుంజును చూశాడు. దాన్ని చూడగానే అతనికి నోరూరింది. ఈరోజు ఆహారంకోసం వెతుక్కోనవసరం లేదు అనుకుని మెల్లగా వెళ్ళి కోడిపుంజుని పట్టుకుని తన దగ్గరున్న సంచిలో వేసుకున్నాడు. కోడిపుంజు భయంతో సంచిలోనుంచే గట్టిగా అరిచింది. దాని అరుపులు విన్న పావురం పరిస్థితిని అర్థంచేసుకుంది. వేటగాడికంటే ముందే ఎగిరివెళ్ళి, కాస్తదూరంలో చచ్చినదానిలా పడుకుంది. 'ఆహా! ఏమి నా అదృష్టం,ఈ వేళ విందుభోజనంచేస్తాను' అనుకుంటూ వేటగాడు సంచిని పక్కనే పెట్టి పావురం కోసం వెళ్ళాడు. ఈలోగా సందుకోసం ఎదురు చూస్తున్న కోడిపుంజు వెంటనే సంచిలోంచి బయటపడింది. వేటగాడు పావురాన్ని పట్టుకునేలోపు అదికాస్తా తుర్రుమంది. దొంగపావురం ఎంతమోసం చేసిందో అని తిట్టుకుంటూ వెనకకు వచ్చి సంచి తీసుకుంటే అది ఖాళీగా కనిపించింది. తన అత్యాశవల్లే చేతిలోఉన్న దాన్ని పోగొట్టుకున్నానని తనను తాను తిట్టుకుంటూ ఇంటిదారి పట్టాడు. అక్కడి పొదల్లోనే వేటగాడికి కనిపించకుండా దాక్కున్న కోడిపుంజు తన ప్రాణాలుకాపాడిన మిత్రుడికి ఎంతగానో కృతజ్ఞతలు చెప్పుకుంది.



# పదవనము

బాలలూ! పదవనం అంటే పదముల యొక్క వనమనీ, దవనం అంటే వాసనగల ఒకరకం మొక్క అని అర్థం! ఇంకొక పదం తీసుకుందాం... పదకము అంటే కంఠభూషణ విశేషము, దకము అంటే నీరు. నాలుగు అక్షరాల పదానిది ఒక అర్థమైతే, చివరి మూడు అక్షరముల పదానిది వేరే అర్థం. మొత్తం నాలుగు అక్షరాల పదానికి, చివరి మూడక్షరాల పదానికి ఈ క్రింద ఆధారాలు ఇవ్వబడినవి. ఇచ్చిన ఆధారాలతో నాలుగు అక్షరాల పదాన్ని కనిపెట్టండి. ఇక్కడ ఇచ్చిన అన్ని పదాలకు చివరి అక్షరం 'ము' వస్తుంది. ఈ ఆధారాలు మీకు సహాయపడతాయి ప్రయత్నించండి, రాకపోతే పెద్దలను, గురువులను సంప్రదించండి. అప్పటికీ తెలియకపోతే **జవాబులు 23వ పేజిలో చూడండి.**

| క్రమ సంఖ్య | 4 అక్షరాల పదమునకు ఆధారము | 3 అక్షరాల పదమునకు ఆధారము | పదము |
|---|---|---|---|
| 1. | వృత్తాంతము, వార్త | పన్ను | ---ము |
| 2. | అల | రంగు, నాటకమాడుచోటు | ---ము |
| 3. | గ్రామపులెక్కలు వ్రాయువాడు, ఒక ఇంద్రియము | యుద్ధము | ---ము |
| 4. | కోరిక | పరిమితి కలది | ---ము |
| 5. | నిస్సత్తువ, ఓపికలేకుండుట | ద్రవము, నీరు, చారు | ---ము |
| 6. | భోజనము | దండ | ---ము |
| 7. | ఘోరము | అప్పు | ---ము |
| 8. | రూపము కలది, శరీరము కలది | ఆరు రుచులలో ఒకటి | ---ము |
| 9. | రగుల్చునది, వెలిగించునది, వంటకట్టె | డబ్బు | ---ము |

| | | |
|---|---|---|
| 10. రమ్మని ఆహ్వానించుట | గడచిపోయినది | ---ము |
| 11. ఏరండ తైలము, చిక్కని నూనెలాంటిది | సంతోషము | ---ము |
| 12. శ్రావ్యమైన గానము | పాట | ---ము |
| 13. సమాచారము, వార్త | అనేక పట్టణములు గల భూభాగము | ---ము |
| 14. సంసారము | నివాసము, పట్టణము | ---ము |
| 15. నమ్రత, అణకువ | అందము, నీతి | ---ము |
| 16. పోవుట, ప్రయాణము | మనస్సు | ---ము |
| 17. సాయంకాలము | మర | ---ము |
| 18. తాబేలు | సన్యాసులు మొ॥వారి నివాసము | ---ము |
| 19. సమ్మతము, అంగీకారము | సంతోషము, ఉల్లాసము | ---ము |
| 20. ఒకానొక పూలచెట్టు | నూలుతాడు, సూత్రము | ---ము |
| 21. గర్వము, మదము | దేవతలు, మునులు తీర్చే కోరిక | ---ము |
| 22. తుల్యము, ఒక వాయువు | ఆత్మాభిమానము, గౌరవము | ---ము |

**సమర్పణ: *పలివెల సుబ్బారాయుడు*, హైదరాబాద్**

**జవాబులు 23 వ పేజిలో చూడండి.**

---

**6వ పేజిలో 'క్విజ్' జవాబులు:** 1.శ్రీ, 2.తాబేలు, 3.గాడిద, 4.ఏనుగు, 5.ఎద్దు, 6.కాళము, 7.పాము, 8.హస్తి, 9.ఉడుత, 10.కుక్క, 11.ఎలుక, 12.సింహం, 13.పులి, 14.ఆవు, 15.ఎలుగుబంటి, 16.వరాహము. 1,6,8 గడుల జవాబులను కలిపితే వచ్చే పుణ్యక్షేత్రం 'శ్రీ కాళహస్తి.'

# అసలైన భక్తులు

శ్రీమతి సుంకర రాజకుమారి, నూజివీడు.

**(సందర్భం–**ముగ్గురు స్త్రీలు గుడికి వెళుతూ ఉంటారు. అంతలో లక్ష్మివచ్చి వారిని కలుస్తుంది.)

**లక్ష్మి :** ఏమిటి? అందరూ ఎక్కడికో వెళ్ళటానికి సిద్ధమైనట్లున్నారు?

**సీతాదేవి :** అవును లక్ష్మీ! ఈరోజు విజయదశమి పండుగ కదా! అందుకే అందరమూ దుర్గమ్మ తల్లిని దర్శించుకుందామని అమ్మవారికోవెలకు బయలుదేరాము.

**లక్ష్మి :** నేనూ వస్తాను.

**అందరూ :** అలాగే పదండి వెళదాం.

(అందరూ ఆలయంలోకి వెళ్ళి అమ్మను దర్శించుకొంటుండగా పైనుండి ఒక బంగారుపళ్ళెం పెద్ద శబ్దంతో పడుతుంది. అందరూ ఉలిక్కిపడి కిందకు చూస్తారు.)

**అందరూ :** ఈ పళ్ళెం మీద ఏదో వ్రాసి ఉన్నదే అని "ఈ పళ్ళెం నా భక్తులకు మాత్రమే చెందుతుంది" అన్న దానిని గట్టిగా చదువుతారు.

**రమాదేవి :** నేను రోజూ శుచిగా గాయత్రీ మంత్రం 108 సార్లు జపిస్తాను. నాకంటే భక్తులు ఎవరుంటారూ? ఈ బంగారు పళ్ళెం నాదే (అని పట్టుకుంటుంది. దానిని పట్టుకోగానే అది మట్టిపళ్ళెం కింద మారిపోతుంది. వెంటనే ఈ మట్టిపళ్ళెం నాకెందుకు? అని కింద పెట్టేస్తుంది.)

**సీతాదేవి :** నేనయితే రోజూ లలితా సహస్రనామాలను స్మరిస్తూ అమ్మవారికి కుంకుమార్చన చేస్తాను. ఈ బంగారు పళ్ళెం నాదే (అని పట్టుకుంటుంది. దానిని పట్టుకోగానే అది మట్టిపళ్ళెం కింద మారిపోతుంది. వెంటనే ఈ మట్టిపళ్ళెం నాకెందుకు? అని కింద పెట్టేస్తుంది.)

**పార్వతి :** మీరెవరూ నిజమైన భక్తులు కారు. నేను రోజూ భగవద్గీత పారాయణ చేస్తాను. వేదం పఠిస్తాను. అంతే అనుకుంటున్నారా? అమ్మవారిని రోజూ వెండి పుష్పాలతో పూజిస్తాను. మీరంతా చూస్తూఉండండి. ఈ పళ్ళెంనాకేచెందుతుంది (అని అంటూ బంగారు పళ్ళెమును ముట్టుకోగానే అది తిరిగి మట్టిపళ్ళెంగా మారిపోతుంది.)

**అందరూ :**అయ్యో! ఇదేమిటి చాలా చిత్రంగా ఉందే. అయితే మనమెవ్వరమూ అసలైన భక్తులము

కాదన్నమాట! మరైతే ఈ గుడిలో నిజమైన భక్తులెవరో? (ఇంతలో ఒకామె గుడిలోకి వస్తుంది.)

**అందరూ :** అమ్మా మీరెవరోగాని ఆ క్రిందపడిఉన్న బంగారు పళ్ళెమును పట్టుకుని చూడండి

**కొత్తగా వచ్చిన ఆమె :** నా పేరు వసుధ. నాకు ఆ బంగారుపళ్ళెం మీద వ్యామోమంలేదు. నేను ఆ జగదేక సుందరిని, అఖిలాండేశ్వరిని దర్శించుకుందామని వచ్చానమ్మా....

**పార్వతి :** అలా కాదమ్మా అసలు నిజమైన భక్తులు ఎవరో తెలుసుకోవాలని మాకు కోరికగా ఉంది వసుధగారు. మాకోసమైనా మీరు ఆ పళ్ళెమును పట్టుకోండి.

**వసుధ :** సరే! మీమాట కాదనలేను. పట్టుకుంటాను.

(అని బంగారు పళ్ళెం పట్టుకుంటుంది. కానీ, అది మట్టిపళ్ళెంగా మారలేదు.)

**అందరూ :** ఆశ్చర్యం! మహా ఆశ్చర్యం!! మహాద్భుతం!! వసుధగారూ! మీరే నిజమైన భక్తులు! మీరు ఏ ఏ ఉపనిషత్తులు చదివారు? ఏమేమి పూజలు చేశారు చెప్పండమ్మా?

**వసుధ :** అమ్మా! మీరంతా ఏమిటేమిటో మాట్లాడుతున్నారు. నాకసలు చదువురాదు. ఏ గ్రంథాలూ చదవలేదు, ఏ పూజలూ చేయలేదు.

**అందరూ :** మరి ఇలా ఎలా జరిగింది? అవును నువ్వు ఆలయానికివస్తూ ఒక్క కొబ్బరికాయకానీ, అరటి పళ్ళు కానీ, అభిషేకానికి పాలుకానీ తీసుకుని రాలేదే?

**వసుధ :** అయ్యో తెచ్చానమ్మా! టెంకాయ, అరటిపళ్ళు, పాలు తెచ్చానమ్మా!

**అందరూ:** మరి ఏవి అమ్మవారికి సమర్పించలేదే?

**వసుధ :** నేను వచ్చేటప్పుడు ఒక ముసలి పేదరాలు ఆకలితో అల్లాడిపోతోంది. అందుకని ఆమెకు నేను తెచ్చిన అరటిపళ్ళు, పాలు ఇచ్చి ఆకలి తీర్చుకోమని చెప్పాను.

**పార్వతి :** అలాగా ఇప్పుడు అర్థమయ్యింది నువ్వు నిజమైన భక్తురాలు ఎలా అయ్యావో! మనం ఎన్ని యజ్ఞ యాగాదులు చేశాము, ఎన్ని పూజలు చేశాము అని భగవంతుడు చూడడు.

**రమాదేవి :** అందరిలో భగవంతుని దర్శించాలని, దీనజనులకు ఎంతసేవ చేశామా అని, ఎంతమంది ఆర్తులను ఆదుకున్నామా? అని మాత్రమే భగవంతుడు చూస్తాడని నిన్ను చూసిన తర్వాత మాత్రమే మాకు బోధపడింది.

**అందరూ :** మా కళ్ళు తెరిపించావు అమ్మా! నేటినుంచి మేముకూడ నువ్వు నడిచిన బాటలోనే నడుస్తూ దేవుని అనుగ్రహానికి పాత్రులమవుతాము. **(అందరూ నిష్క్రమిస్తారు) సమాప్తం.**

# అమృత గుళికలు - 169

'అర్థబలము, ధనబలము, అంగబలము భక్తి ముక్తులు సాధింపపనికిరావు (అటులే విద్యాబలముకూడా) దైవబలమెుక్కటే మనుజు ధన్యుజేయు' జగత్తులో ఎన్ని బలములుండినప్పటికిని అన్నిబలములు దుర్బలములే. జగత్తులో ధనబలము మాత్రమే బలమనుకుంటున్నారు. కాదు దైవబలమొక్కటియే ప్రధానమైన బలము. శంకరాచార్యులవారు కూడా ఇలా చెప్పారు...



**మా కురు ధనజన యౌవన గర్వం**
**హరతి నిమేషాత్ కాలాత్ సర్వం**

ధన, జన, యౌవన గర్వం క్షణమాత్రము మించు మించినట్లుగా (మెరుపు మెరిసినట్లు) ఉంటుండాయి. ధనము జడమైనది. ఈ జడమైనదానికి ఎక్కడ ఉంది బలము? మనిషియందున్న మనస్తత్వము వల్లనే దీనికి బలము కాని, దుర్బలము కాని ఏర్పడుతుంటుంది.

ధనముకాని, విద్యకాని ఇంకేవిధమైన సంపత్తులు కాని అన్నీ కూడను పరిశుద్ధమైన జలము వంటివి. ఈ జలము ఏ రంగు బాటిల్‌లో చేరినప్పుడు ఆ రంగును, స్వరూపాన్ని పొందుతుంటాది. కాబట్టి ధనముకాని, విద్యకాని, ఇంకేవిధమైన శక్తిసామర్థ్యములుకాని మనిషి స్వభావాన్ని బట్టే ఆ స్వరూపాన్ని చెందుతున్నాయి. ధనముచెడ్డది కాదు. వినియోగ విధానములు చెడ్డవిగా కాని లేక మంచివిగా కాని మారుతున్నాయి. అందరు ధనవంతులకును అహంకారముండదు. విద్యావంతులందరికీ అహంకారముండదు. వాని స్వరూప స్వభావములను పురస్కరించుకుని, మనసుయొక్క ప్రభావం సంబంధం చేసుకుని వారియొక్క మంచి చెడ్డలు మారుతున్నాయి. కనుకనే మనస్సుయొక్క ప్రభావాన్ని మంచి మార్గములో ప్రవేశ పెట్టడానికి ఆధ్యాత్మిక మార్గమే సరియైనటువంటి మార్గము. ఆధ్యాత్మికములో అనేక విధములైన అడ్డులు తగులుతుంటాయి. అందులో మొట్టమొదటిది వాసనలు. వాసనలనగా అభిమాన మమకారములు. ఎలాంటి అభిమాన మమకారములు? లౌకికమైన భోగభాగ్యములు అనుకూలములు, ఆనందము, ఇలాంటివంతాకూడను సత్యముగా భావిస్తుంటాడు. భగవదాజ్ఞను శిరసావహించి ఆ కార్యములయందు దీక్షను పూని, విజయమును సాధించవలెనని ఆశించాలి.

**– బాబా.**

# తల్లుల పెంపకం - తనయుల సౌభాగ్యం

**శ్రీమతి కొమరగిరి జయప్రద**, ఎడిటర్ 'శ్రీవాణి', మచిలీపట్టణం.

**సీతా మహాసాధ్వి చెలగి పెంచుటచే గదా**

**కవలు లవకుశులు ఘనులు అగుట॥**

"ఏ దేశ వాఙ్మయమునందైనను శ్రీరామచంద్రుని వంటి పురుషోత్తములు లభించిన లభించవచ్చునేమో కానీ సీత వంటి ఆదర్శచరిత్ర గల పతివ్రతా తిలకము లభించుట దుర్లభం" అని చెప్పారు స్వామి వివేకానంద.

శ్రీమద్రామాయణము నందు సీతాదేవికి శ్రీరామచంద్రునితో సమానమగు ప్రాధాన్యతనిచ్చాడు వాల్మీకి మహర్షి అంతేకాదు ఈ మహాకావ్యానికి **"సీతాయాశ్చరితమ్"** అని పేరు కూడా పెట్టాడు.ఆమె ఒక్క భారతదేశానికే కాదు ప్రపంచంలోని నారీలోకానికే ఆదర్శమహిళ. పతిభక్తి, ధర్మనిష్ఠ, క్షమ, కరుణ, దయ, నిర్మలమగు ప్రేమ, ఆమెలో మూర్తీభవించినవి. ఆమె పన్నెండు సంవత్సరాలు మహారాణిగా అయోధ్యలో ఉన్నది. పదమూడు సంవత్సరాలు భర్తతో అరణ్యవాసం చేసింది. సుఖదుఃఖాలను శ్రీరామునితో పంచుకున్నది. మరి ఒక సంవత్సరం భర్తకు దూరమైంది. అశోకవనంలో భర్తకు దూరమైనా ఎవరినీ ఏమీ అనకుండా ఎంతో ఓర్పుతో వ్యవహరించింది.

ఏ రాముడికోసం సంవత్సరకాలం వ్యథ చెందిందో ఆ శ్రీరాముడే ఆమెకు అగ్ని పరీక్ష పెట్టాడు. సీతాదేవి శ్రీరామునికి ప్రదక్షిణం చేసి "నా హృదయంలో నిత్యం రాఘవుని తప్ప ఇతరులను తలంచనిచో నన్ను అగ్నిదేవుడు కాపాడు గాక!" అని అగ్నిలో ప్రవేశించింది. అగ్ని చల్లబడిపోయింది. దేవతలందరూ "ఓరామా! సీతాదేవి మహా పతివ్రత. నిశ్చయుడవై సీతను పరిగ్రహింపమని హితవు చెప్పారు". అగ్నిపరీక్షకు కూడా తట్టుకుని భర్త ప్రేమకు, ప్రజల అభిమానానికి పాత్రురాలైంది.

శ్రీరామచంద్రుడు లోకాపవాదమును పురస్కరించుకుని నిండు చూలాలైన సీతాదేవిని నిర్దాక్షిణ్యంగా అడవుల పాలు చేసినా సీతాదేవి ఒక్క నిందావాక్యమును కూడా పలుకలేదు. అయోధ్య అయినా అరణ్యమయినా, వియోగమైనా, సంయోగమైనా స్థితప్రజ్ఞురాలిగా నిలిచిపోయింది, అందుకే వాల్మీకి తన ఆశ్రమంలోనే ఆశ్రయమిచ్చాడు.

**లవకుశుల జననం:**



ఆ ముని వాటికలోనే లవకుశులు జన్మించారు. వాల్మీకియే వారికి విద్యాబుద్ధులు నేర్పించారు. అటు మహర్షి ,ఇటు తల్లి ఈ ఇద్దరి పెంపకంలో వారు పెరిగి పెద్దవారయినారు. సీతాదేవి పిల్లలకు శ్రీరాముడే దేవుడని భక్తితో రామనామాన్ని స్మరించడం నేర్పింది. శ్రీరాముని శౌర్యం గురించి, ధైర్యాన్ని గురించి చెప్పి రాముని ధర్మతత్పరతను గురించి చెప్పింది. రఘువంశం గురించి చెప్పింది. ఆవంశంలోని తాత తండ్రుల గొప్పదనం గురించి చెప్పింది. సీతాదేవి ఎంత పవిత్రురాలో తెలిసినా, ఆమె హృదయంలో తనకు తప్ప మరెవరికీ స్థానం ఆమె ఇవ్వదని తెలిసినా, సత్యం కోసం , ధర్మం కోసం ఆమెను పరిత్యజించాడు. అటువంటి వారు దేవతలలో కూడా ఉండరేమోనని వారికి నిత్యం బోధించేది. కానీ, ఒక్కరోజైనా వారే మీ తండ్రి అని చెప్పలేదు. అసలు వారి భావనలో ఆ ఆలోచన రాకుండా పెంచింది మహాసాధ్వి సీతాదేవి. తల్లి మాటలను వినటమే తప్ప ఎదురు ప్రశ్న వేయని బుద్ధిమంతులు, రఘువంశోద్ధారకులు అయిన లవకుశులు.

అటువంటి తల్లులు ఈనాడు ఎక్కడైనా ఒక్కరైనా మనకు కనిపిస్తారా? అసలు లవకుశులు “అమ్మా! మా నాన్నగారు ఏరీ? ఎక్కడున్నారు?” అని తల్లిని ప్రశ్నించారా? అదే ఈనాటి పిల్లలయితే ఊరుకుంటారా? అదీ ఆ ఆదర్శమాత పెంపకం యొక్క గొప్పదనం. చెప్పింది వినటం, పెట్టింది తినటం, గురువులు చెప్పిన విద్యలను భక్తిశ్రద్ధలతో, వినయంతో నేర్చుకోవటం. “విద్యార్థులు విద్యార్థులుగానే ఉండాలి కానీ, విషయార్థులు కాకూడదు” అన్నారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు. అందుకే మొదట తల్లిని గురించి చెప్పి ఆమె అలా పెంచింది కాబట్టే లవకుశులు అంతటి వారయినారు అని చెప్పారు. ఆ మాటలలోని అంతరార్థాన్ని మాతృమూర్తులు, పిల్లలు కూడా గ్రహించాలి. జై సాయిరాం.



## శ్రీమదాంధ్ర మహా భారత కథలు
## (ఆంధ్రమహాభారత పరిచయం)

# భీముని బలం - అర్జునుని విలువిద్య

*(గత సంచిక తరువాయి)*

**భీముని బలం :** కుంతీదేవి భీమసేనుని కనిన పదవరోజున దేవునికి మ్రొక్కడానికి ఆ బాలుని ఎత్తుకుని శతశృంగ పర్వతం మీది దేవాలయమునకు వెళ్ళెను. ఒక కొండగుహనుండి పులి ఒకటి బయటకు వచ్చి వీరిమీద పడేలోపుగానే పాండురాజు తన వాడి బాణాలతో ఆపులిని సంహరించి, భీముడిని, కుంతిని కాపాడాడు. పెద్దపులిని చూసిన భయంతో కుంతి తడబడి చేతిలోఉన్న పిల్లవాడిని వదిలేసింది. భీముడు కిందపడగానే అతడి శరీరపు తాకిడికి ఆ కొండరాళ్ళు పొడిపొడి అయ్యాయి.

ధృతరాష్ట్రుని ప్రేమతో పాండవులు కౌరవులతో కలిసి పెరుగుతూ ఉంటారు. వినయవిధేయతలు కలిగిన పాండవులు అందరి మన్ననలు పొందేవారు. గుండ్రంగా తిరిగేటప్పుడు, వేగంగా పరుగెత్తేటప్పుడు, పెనుగులాడేటప్పుడు భీముడు అందరికన్నా ముందుండేవాడు. పది పదిహేనుమందిని ఒక్కసారిగా పట్టి, చెల్లాచెదరుచేసి విసిరివేసేవాడు. అందరినీ ఒకేసారి ఈడ్చుకుని వెళ్ళేవాడు. జలక్రీడలాడేటప్పుడు ఒక్కొక్క భుజంమీద పదిమందిని వేసుకుని వాళ్ళను నీటిలో ముంచుతూ, పైకి లేపుతూ గట్టుకు చేర్చేవాడు. వాళ్ళు పండ్లుకోయటానికి చెట్లుఎక్కితే ఆ చెట్లమొదళ్ళను బలంగా, వేగంగా కదిల్చి పండ్లతోసహా వాళ్ళుకూడా నేలరాలేటట్లు చేసేవాడు.

ఈవిధమైన వీరోచితమయిన పనులుచేస్తూ, కౌరవులకు భయము, అవమానము కలిగించేవాడు. వారు అసూయతో భీముని ఏ విధంగానైనా చంపాలని ఎదురుచూస్తూ ఉండేవాళ్ళు. ఒకరోజు జలక్రీడలాడే సమయంలో వాయుపుత్రుడైన భీముడు కౌరవులనందరినీ ఓడించి, అలిసిపోయి 'ప్రమాణకోటి' అనే స్థలంలో చల్లని గాలిపీల్చుతుండగా గాఢమైన నిద్రపట్టేసింది. దుర్మార్గుడైన దుర్యోధనుడు భీముని గట్టి తీగలతో బంధించి, కోపంతో గంగలోకి

త్రోయించాడు. భీముడు వెంటనే మేలుకుని గట్టిగా ఒళ్ళువిరుచుకోగానే ఆ తీగలన్నీ తెగి భీముడు నీటినుంచి పైకితేలి వచ్చాడు.

ఒకనాడు భీముడు నిద్రించుచుండగా దుర్యోధనుడు తన రథసారథిని పిలిచి గొప్ప విషంకల నల్లత్రాచులను తెప్పించి భీముని అన్ని అవయవాలనూ ఆ పాములతో కరిపించాడు. దిట్టమైన విషమున్న ఆపాముల కోరలు భీమసేనుని వజ్రశరీరము పైతోలునుకూడా చీల్చలేకపోయాయి. పాపపు బుద్ధికలవారి పనులెప్పుడూ ఫలించవు. అతి బలవంతుడైన భీముడు వెంటనేలేచి ఆ పాములను కాళ్ళతో రాచి చంపాడు. సారథిని ఎడమచేతితో కొట్టగా ఆ దెబ్బకు ముక్కునా నోటా నెత్తురు కారి ఆ సారథి నేలమీద పడిచనిపోయాడు.

మరొకరోజు దుర్యోధనుడు అధర్మమనికూడా ఆలోచించకుండా, ఎవరికీ తెలియకుండా అన్నంలో విషం కలిపి భీమునికి పెట్టించాడు. వంటవాడు అందరినీ సమానంగా చూసేవాడు. భీమునికి ఆ అన్నం మంచిదికాదని తినవద్దని చెప్పాడు. భీముడు ఆకలితో ఉండటంవలన ఆ విషపు అన్నాన్నితిని జీర్ణించుకున్నాడు. అదిజీర్ణమై అతనికి అమృతమయింది. ఈ విధంగా భీముడు చిన్నతనంనుండి మహాబలవంతుడై ఎదురులేక నిలిచాడు. పాండవులలో భీముని చంపితే ఇంక బలవంతులు లేరని మిగిలిన పాండవులను చెరసాలలో బంధించి సమస్త భూమండలాన్ని తానే పాలించవచ్చని దుర్యోధనుని దురభిప్రాయం. 'చెరపకురా చెడేవు' అన్న సామెతలాగా దుర్యోధనుని ఆలోచన ఉన్నది. ఇంక అర్జునుని విలువిద్య ఎంతగొప్పదో వచ్చే నెల చూద్దామా!!! ***(ఇంకా ఉంది)***

**ఆధారం : కవిత్రయం వారి శ్రీమదాంధ్రమహాభారతం (శ్రీమత్ ఆంధ్ర మహాభారతం)**

**సేకరణ, సమర్పణ : శ్రీమతి ఆర్. దుర్గ, హైదరాబాద్.**

---

**15వ పేజిలో 'పదవనము'కు జవాబులు:** 1.ఉదంతము, 2.తరంగము, 3.కరణము, 4.కామితము, 5.నీరసము, 6.ఆహారము, 7.దారుణము, 8.సాకారము, 9.ఇంధనము, 10. స్వాగతము, 11.ఆముదము, 12,సంగీతము, 13.సందేశము, 14.కాపురము, 15.వినయము, 16.గమనము, 17.సాయంత్రము, 18. కమఠము, 19.ఆమోదము, 20.మందారము, 21.కావరము, 22.సమానము.

# పుట్టపర్తిలో సత్యసాయి బాలవికాస్ పూర్వవిద్యార్థుల స్నాతకోత్సవం

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య ఆశీస్సులతో పుట్టపర్తిలో బాలవికాస్ పూర్వవిద్యార్థుల ఏడో స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న బాలవికాస్ పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి రామసుబ్రమణియన్, సత్యసాయి సంస్థల అధ్యక్షుడు శ్రీ నిమీష్ పాండ్యా పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను నేర్చుకుంటే వ్యక్తిలో, కుటుంబంలో, సమాజంలో మార్పుతో దేశమంతా శాంతి నెలకుంటుందని తమ ప్రసంగంలో పేర్కొన్నారు. సాయికుల్వంత్ హాల్‌లో విద్యార్థుల వేదమంత్రోచ్చారణతో మొదలైంది. బాలవికాస్ గురువుల, విద్యార్థుల బ్రాస్‌బ్యాండ్, కవాతు, పతాకాలతో సత్యసాయి భక్తిగీతాలను ఆలపిస్తూ మందిరానికి చేరుకున్నారు. విద్యార్థులందరూ స్నాతకోత్సవ ప్రతిజ్ఞను చేశారు. బాలవికాస్ పూర్వవిద్యార్థులు బాలవికాస్‌తో తమ అనుభవాలను వివరించారు.

పశ్చిమబెంగాల్ బాలవికాస్ విద్యార్థులు బృంద నృత్యాన్ని ప్రదర్శించారు. కర్ణాటక బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి భక్తిగీతాలను ఆలపించారు. పదునాలుగు మంది సత్యసాయి బాలవికాస్ పూర్వవిద్యార్థులప్రతిభా పురస్కారాలను అందించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి రామసుబ్రమణియన్ తమ ప్రసంగంలో బాలవికాస్ విద్యాబోధన విద్యార్థులను గొప్ప మానవతావాదులుగా చేస్తుందన్నారు. సాంకేతిక ప్రగతిలో ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిఉందని వివరించారు. తాను కూడా తన పదవీవిరమణ అనంతరం బాలవికాస్ గురువుగా బాధ్యతలను తీసుకుంటానని తెలిపారు. వారు తమ చిన్నతనంలో బాలవికాస్ ప్రారంభదశలో తమ సోదరునితో కలిసి బాలవికాస్ క్లాసులకు వెళ్ళడం గురించి గుర్తు తెచ్చుకున్నారు. బాలవికాస్‌కు ప్రపంచగతిని మార్చే శక్తి ఉందని తెలిపారు.



ఫిబ్రవరి 2020

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డమాటలట్టె చెవికి చేరు**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురా!**
**ఎట్టి చదువులున్న ఏమి ఫలము?**

మంచి మాటలు వినరు. చెడ్డమాటలైతే ఒక్క క్షణములోపల చెవికి చేర్చుకుంటారు. హృదయమునుంచి ఇంక చేతలోకి వచ్చేస్తుంది. అంటే పనిలో ప్రవేశిస్తాడు. కనుకనే మనసునందు వాక్కునందు, క్రియయందు ఏకత్వాన్ని 'త్రికరణ శుద్ధి'ని మనం నిరూపించాలి.

నీలో ఉన్న దోషాలను పూర్తిగా నిర్మూలం గావించడానికి పూనుకోవాలి. నీ దోషాలనంతా సమర్థించుకోవడానికి ప్రయత్నించకూడదు. అట్లు చేసినవాడే మహాద్రోహి!! ఈనాడు అటువంటివ్యక్తులే అధికంగా కన్పిస్తున్నారు. కనుక విద్యార్థులు భావిభారత పౌరులు, దేశంయొక్క సౌభాగ్యాన్ని ఆశించే వీరులు. లేతహృదయులైన మీయందు ఈ పవిత్రమైన భావములీనాడు అభివృద్ధికావాలి. చెడ్డమాటలనే చెవికిచేర్చుకునేవారు భగవంతుని (స్వామిని) తెలుసుకొనలేరు. ఎంత గొప్ప చదువు చదివినా ఏమీ ఫలము ఉండదు. **- బాబా.**

ఫిబ్రవరి 2020 కి బాక్ కవరు మాటరు

0